క్లుప్తంగా

నేడు విద్యుత్ అదాలత్

రాజంపేట రూరల్ : డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సోమవారం డివిజనల్ విద్యుత్ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రాజశేఖర్ రెడ్డి సోమవారం తెలియజేశారు. డివిజనల్ పరిధిలోని రాజంపేట టౌన్, రాజంపేట రూరల్, పెనగలూరు, పుల్లంపేట, రైల్వేకోడూరు టౌన్, రైల్వేకోడూరు రూరల్, చిట్వేలి, ఓబులవారిపల్లి, ఒంటిమిట్ట, సిద్దవటం, నందలూరు పరిధిలోని సెక్షన్లకు సంబంధించిన వారు వారి విద్యుత్ సమస్యలను అదాలత్‌లో తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

సిద్దవటం : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో మంగళవారం నుంచి ఈ నెల 20 తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగునని గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయంలో నవలు, కథల పుస్తకాలు, వార్తా పత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలు ఉన్నాయన్నారు. వీటిని విద్యావంతులు, విద్యార్థులు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులకు పుస్తక పఠనం, వ్యాసరచన పోటీలు వకృత్వ పోటీలు, చిత్రలేఖనం వంటి పోటీలను నిర్వహించి బహుమతులను అందజేస్తామని ఆమె పేర్కొన్నారు.

నేడు కొండూరులో గడప గడపకూ కార్యక్రమం

పెనగలూరు : మండలంలోని కొండూరు – 2 సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగనుందని ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. కొండూరు పంచాయతీలోని గట్టువారిపల్లె, పాత దామనచెర్ల, కొత్త దామనచెర్ల, వి.ఎం పురం గ్రామాలలో కార్యక్రమం చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, వైస్ ఎంపీపీ కె.విజయ్ రెడ్డిలు హాజరుకానున్నట్లు వైఎస్సార్ సిపి మండల కన్వీనర్ కేతా చక్రపాణి మరో ప్రకటనలో తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న స్కూటర్

చిన్నమండెం : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ఈ ప్రమాదంలో చిన్నర్సుపల్లెకు చెందిన బైనమేని కృష్ణయ్య అనే కూలీకి గాయాలైనట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలు.. చిన్నర్సుపల్లెకి చెందిన కృష్ణయ్య కూలీ పనులు ముగించుకొని తహసీల్దార్ కార్యాలయం వద్ద నడుచుకుంటూ వెళ్తున్నాడన్నారు. రాయచోటి వైపు నుంచి ద్విచక్రవాహనం ఏపీ04 ఏహెచ్ 5972లో రాయచోటికి చెందిన పఠాన్ షాకీర్‌ఖాన్ అనే వ్యక్తి కృష్ణయ్యను ఢీకొన్నారన్నారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన కృష్ణయ్యను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని దిన్నెపాడు గ్రామం వడ్డెపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయానికి సర్పంచ్ రవిరాజు ఆధ్వర్యంలో దిన్నెపాడు గ్రామం నరసింహరాజు పల్లె గ్రామస్తుడైన స్వర్గీయ శ్రీ శిబ్యాల రెడ్డయ్యరాజు, లక్ష్మమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాస ఐటీఐ ప్రిన్సిపాల్ కొండూరు రామరాజు, ఆయన సతీమణి విజయమ్మలు రూ. 30 వేలు విరాళంగా వడ్డిపల్లె గ్రామ పెద్దలకు అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, గ్రామస్తులు సన్మానించారు.

15న కర్మక్రియలు


కె. సుబ్బారెడ్డి

తిరుపతి కల్చరల్ : ప్రముఖ వ్యాపారవేత్త కన్‌స్ట్రక్షన్ రంగంలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ డైరెక్టర్ కె.కాశీ విశ్వనాథ్ తండ్రి కె.సుబ్బారెడ్డి ఈనెల 5వ తేదీన మృతి చెందారు. వీరి కర్మక్రియలు ఈనెల 15వ తేదీ బుధవారం టి.సుండుపల్లి మండలం తిమ్మసముద్రం, కామిరెడ్డి చెరువులో జరుగనున్నట్లు సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాల భైరవునికి దీప సేవ

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవ స్వామికి సోమవారం కూష్మాండ దీప సేవ నిర్వహించారు. నగర పరిధిలోని కాలభైరవపురంలోని స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఈ పూజోత్సవం చేపట్టారు.

అన్నదానం

కడప ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ సేవాతత్వాన్ని అలవరచుకోవాలని ఎస్టీఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. తాను మొక్కు తీర్చుకునే కార్యక్రమంలో భాగంగా కడప ఎర్రముక్కపల్లెలోని నవజీవన్ సేవాశ్రమంలోని వృద్ధులకు, అనాథలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రశేఖర్, ఆయన సతీమణి కలిసి అన్నదానం చేశారు.

వెలుగులమయంగా దీపావళి వేడుకలు

- కేరింతల నడుమ టపాసులు కాల్చిన పిల్లలు, పెద్దలు
- లక్ష్మీ పూజలు, దీపాల వెలుతురుల నడుమ సంబరాలు
- అధికారుల నియంత్రణలేక నింగిని తాకిన టపాసుల ధరలు


రాజంపేట టౌన్: దీపాలు వెలిగిస్తున్న యువతి


రాజంపేట రూరల్: బాణాసంచా కాల్చుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి


చిన్నమండెం: టపాసులు కాలుస్తున్న చిన్నారులు


సంబేపల్లెలో టపాసులు కాలుస్తున్న చిన్నారులు

రాజంపేట టౌన్ : దీపావళి పండుగ సందర్భంగా దీపాల వెలుగులతో ఇళ్ళ ముంగిళ్లు సరికొత్త కాంతులీనాయి. పండుగను పురస్కరించుకొని పిల్లలు, పెద్దలు అన్న తేడా లేకుండా ప్రజలు టపాసులు కాల్చి సందడి చేశారు. దీంతో అంతటా దీపావళి కాంతులు వెల్లివిరిశాయి. తారా జువ్వలు నింగికెగిసి పడ్డాయి. పిల్లల సంతోషం కోసం తల్లిదండ్రులు చిన్నపిల్లల్లా మారిపోయి పిల్లలచే టపాసులు కాల్పించారు. దీంతో ఎటుచూసినా దీపావళి సందడి వాతావరణం కనిపించింది. మహిళలు భక్తిశ్రద్ధలతో లక్ష్మీపూజ చేశారు. కాగా పండుగను పురస్కరించుకొని ఆదివారం రాత్రి పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవీమాత ధనలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రాజంపేట రూరల్ : దుష్ట శిక్షణకు శిష్ట రక్షణకు ప్రతీకగా నిలిచే దీపావళి పర్వదినాన్ని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఎస్టేట్‌లో ఆదివారం, సోమవారం దీపావళి వెలుగులు నింగినంటాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఎస్టేట్‌కు చేరుకుని బాణాసంచా పేల్చారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి తన మనుమడు ఆకేపాటి రాఘవరెడ్డితో కలిసి బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ ఈ దీపావళి రాష్ట్ర ప్రజలందరికి సకల శుభాలు, శాంతి సౌభాగ్యాలు, అష్టైశ్వర్యాలు అందాలని కోరుకున్నారు.

రాయచోటి టౌన్ : తారా జువ్వల మిరిమిట్లు, చిచ్చుబుడ్డీల వెలుగులు, టపాసుల శబ్దాలతో దీపావళి సంబరాలు వేడుకగా జరిగాయి. ప్రతి ఇంటి ముందు దీపాల వరుసలు దర్శమిచ్చాయి. చిన్నా పెద్ద, తేడా లేకుండా దీపావళిని సంబరంగా జరుపుకుంటూ కనిపించారు. ఆదివారం ఉదయం నుంచి పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు టపాసులు కాల్చారు. ఇంటిలో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు జరిపి తీపి వంటలు వండుకొని ఆరగించారు. కాగా అధికారుల నియంత్రణ లేకపోవడంతో టపాసుల ధరలు ఆకాశాన్నంటినట్లు వినియోగదారులు వాపోయారు.

సిద్దవటం : మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పిల్లలు, పెద్దలు, యువకులు, మహిళలు పెద్దఎత్తున వివిధ రకాల టపాసులు కాల్చుతూ పండుగను జరుపుకున్నారు.

సంబేపల్లె : మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలలో దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు ఆది, సోమ వారాలలో ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సమేతంగా బాణాసంచా పేల్చారు. తమ జీవితాలలో కొత్త వెలుగులు నింపాలని పలు ఆలయాలలో ప్రజలు పూజలు నిర్వహించారు.

నందలూరు (రాజంపేట) : మండలంలో ఆది, సోమవారాలలో ప్రజలు అత్యంత ఘనంగా దీపావళి పండుగను జరుపుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి అమావాస్య మొదలుకావడంతో ఆరోజు రాత్రి, మరికొంత మంది సోమవారం నాడు పండుగను నిర్వహించుకున్నారు. మహాలక్ష్మీ అమ్మవారిని అత్యంత సుందరంగా అలంకరించి పిండి వంటలతోపాటు వివిధ రకాల ఆహారపదార్థాలను తయారు చేసి దేవుళ్ల ముందు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమ మొక్కులు తీర్చుకున్నారు. పిల్లలు, పెద్దలు టపాసులు కాలుస్తూ సంతోషంగా దీపావళి పండుగను జరుపుకున్నారు.

చిన్నమండెం : మండల వ్యాప్తంగా దీపావళి పర్వదిన వేడుకలను ఆదివారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయాన్నే స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి సమీప ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం వేళల్లో టపాసులను పెద్ద ఎత్తున ప్రజలు కాల్చుకున్నారు.

లక్కిరెడ్డిపల్లె : చీకటిని తొలగించి రంగుల వెలుగులు నింపుతూ జీవితాలను రంగుల మయంచేసే దీపావళి పండుగను మండల ప్రజలు ఆదివారం, సోమవారాలు రెండు రోజులు ఘనంగా జరుపుకున్నారు. లక్ష్మీదేవి ప్రతిమలు, కలశాలను కొలువుతీర్చి పూజలు నిర్వహించారు. మండలంలోని పలు శివాలయాలు, ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వ్యాపార దుకాణాలలో భక్తిశ్రద్ధలతో లక్ష్మీపూజలు నిర్వహించి ప్రసాదాలు, మిఠాయిలు పంచిపెట్టారు. ఆదివారం ఇళ్ల ఎదుట దీపాలు వెలిగించి వెలుగులు నింపారు. దీపావళి సందర్భంగా ఇళ్లవద్ద మహిళలు, పిల్లలు టపాసులు కాల్చుకుంటూ కేరింతలతో ఆనందంగా గడిపారు.


రాజంపేట టౌన్: ధనలక్ష్మీ అలంకారంలో వాసవీమాత


సిద్దవటం : చిచ్చుబుడ్లను కాల్చుతున్న దృశ్యం


రాయచోటి టౌన్: టపాసులు కాల్చుతున్న ప్రజలు


రాజంపేట: పండుగను జరుపుకుంటున్న దృశ్యం

కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో ట్రాఫిక్


నడి రోడ్డుపై అడ్డంగా ఉన్న కారు

రాయచోటి టౌన్ : ఒక కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా తన కారును నడిరోడ్డుపై నిలిపి వెళ్లడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. సోమవారం రాయచోటి పట్టణంలోని గున్నికుంట్ల రోడ్డులో ప్రధాన కూడలి వద్ద ఏపీ 26 బీఎల్ 4478 నంబర్ గల కారును ఒక షాపు ఎదురుగా ఆపి ఎక్కడికో వెళ్లాడు. చాలాసేపటి వరకు రాకపోవడంతో ఆ షాపు యజమాని తన షాపుకు అడ్డంగా ఉందని భావించి నడి రోడ్డుపైకి తోసేశాడు. దీంతో ట్రాఫిక్ ఏర్పడింది. విషయం ట్రాఫిక్ పోలీసులకు తెలియజేయడంతో ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ తన సిబ్బందితో వచ్చి వాహనాన్ని ఒక పక్కకు పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చేశారు. ఇంతలో కారు డ్రైవర్ రావడంతో పోలీసులు డ్రైవర్‌తో పాటు కారును పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి జరిమానాతోపాటు కౌన్సెలింగ్ ఇచ్చారు.

వ్యాధిగ్రస్తురాలికి జిన్నా సంస్థ చేయూత

సంబేపల్లె : మండలంలోని శెట్టిపల్లె గ్రామం తాటిగుంట హరిజనవాడకు చెందిన నాగేశ్వరి అనే మహిళ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. కూలీ పనులు చేసుకొని జీవనం సాగించే నిరుపేద దళిత కుటుంబం కావడంతో రాయచోటికి చెందిన జిన్నా సేవా సంస్థ అధ్యక్షుడు జిన్నా షరీఫ్‌కు తెలిపి వైద్య ఖర్చుల కోసం సహకారం అందించాలని కోరింది. స్పందించిన జిన్నా షరీఫ్ ఆదివారం ఆమెను ఇంటి వద్ద పరామర్శించి, తనవంతుగా రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

టపాసులు పంపిణీ

వైవీయూ : నగరంలోని జేఎస్‌ఓఎస్ ఆర్గనైజేషన్‌లో ఉన్న అనాథ పిల్లలకు జేబీవీఎస్ ది ప్రజర్వర్ సేవా సమితి అధ్యక్షుడు అశోక్ టపాసులను అందజేశారు. దీపావళి పండుగ పురస్కరించుకుని ఆయన విద్యార్థులకు టపాసులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ ప్రతినిధులు పృథ్వీరాజ్, నీరజమణి, సోలమన్‌రాజు, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

కృష్ణా జలాల పునఃపంపిణీని రద్దుచేయాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ నేతలు

రాయచోటి అర్బన్ : కృష్ణా జలాల పునఃపంపిణీపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన ఆ పార్టీ నేతలతో కలిసి రాష్ట్రంలో కరువు పీడిత మండలాల్లో సహాయక చర్యలను చేపట్టాలని నవంబరు 20, 21 తేదీలలో విజయవాడలో జరిగే నిరసన దీక్షకు సంబంధించిన గోడపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ బచావత్ ట్రిబ్యూనల్ తీర్పు ప్రకారం విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయింపబడ్డాయన్నారు. కాగా మిగులు జలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వాడుకునే వెసులుబాటును బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యూనల్ ఆదేశాలపై కోర్టులో వ్యాజ్యం నడుస్తోందన్నారు. కాగా కృష్ణజలాల వినియోగం నీటి వివాదాలపై నాలుగు రాష్ట్రాల నడుమ సమస్య పరిష్కారం కాకమునుపే ఏపీ, తెలంగాణల నడుమ నీటి పంపిణీ అధికారాన్ని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యూనల్‌కు కట్టబెట్టడం వెనుక ఏపీకి అన్యాయం చేసే కుట్ర దాగి ఉందన్నారు.

తెలంగాణ ఎన్నికలలో లబ్ధి ఈ అంశాన్ని కేంద్రం తెరపైకి తెచ్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో 448 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 103 మండలాల్లో కరువు ప్రభావం ఉందని ప్రకటించడం దారుణమంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో విశ్వనాథనాయక్, సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు, సహాయకార్యదర్శి మహేష్, జిల్లానేతలు శ్రీనివాసులు, సుమిత్రమ్మ, కోటేశ్వరరావు, మురళి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

హిందూ సంఘాల కార్యాలయ నిర్మాణానికి వితరణ


దాతను సత్కరిస్తున్న హిందూ సంఘం నాయకులు

పెనగలూరు : మండల కేంద్రం సమీపంలో మోడల్ స్కూల్ వద్ద నిర్మిస్తున్న హిందూ సంఘాల కార్యాలయ భవనానికి తురక వెంకటసుబ్బయ్య రూ. 1.80లక్షలు వితరణగా ఇచ్చినట్లు హిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి కాకర్లరాముడు తెలిపారు. పెనగలూరు గ్రామానికి చెందిన గల్ఫ్ బీసీ సంఘం ప్రెసిడెంట్ తురక వెంకటసుబ్బయ్య ఈ కార్యాలయానికి రూ. 1.80లక్షలు విలువజేసే స్లాబ్ కడ్డీలను వారు అందజేసినట్లు తెలిపారు. అనంతరం దాత వెంకటసుబ్బయ్యను హిందూపరిషత్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.

అలంకరణలో నల్లగంగమ్మ


దర్శనమిస్తున్న దేవరరాయి నల్లగంగమ్మ

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో దీపావళి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి, ప్రజలందరూ సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

మదనపల్లె : జూదం ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు తాలూకా ఎస్ఐ సుధాకర్ తెలిపారు. సోమవారం కోళ్లబైలు పంచాయతీ బయ్యారెడ్డి కాలనీ సమీపంలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.15,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ద్విచక్రవాహన ప్రమాదంలో మహిళకు గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం మీద నుంచి అదుపుతప్పి కిందపడి మహిళ గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. దుబ్బిగానిపల్లెకు చెందిన రామచంద్ర తన భార్య చంద్రిక (18)తో కలిసి ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా, మార్గమధ్యంలోని పెట్రోల్ బంకు సమీపంలో ద్విచక్రవాహనం నుంచి జారి పడి చంద్రిక గాయపడింది. స్థానికులు వెంటనే ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మల్లయ్యకొండపై వ్రతం

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై కార్తీకమాసం తొలి సోమవారం మహిళలు కేదారేశ్వర వ్రతం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు మల్లయ్యస్వామికి ప్రత్యేక అలంకరణలు చేయగా భక్తులు దర్శించుకున్నారు. గోపిదిన్నె శ్రీనివాసులు, ఈశ్వరమ్మ దంపతులు భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

బస్సులను ఒకే మార్గంలోనే నడపాలి

రాయచోటి అర్బన్ : రాయచోటి – సుండుపల్లె – రాజంపేట రూట్‌లో వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులను ఒకే మార్గంలో నడపడం ద్వారా ప్రయాణీకులకు సౌకర్యం ఉంటుందని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ మాజీ సభ్యుడు వై.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని ఠాణా వద్ద నుంచి సుండుపల్లె మార్గంలోని రింగు రోడ్డు వరకు సిమెంటురోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. దీంతో కొద్దిరోజులుగా బస్సులను గున్నికుంట్ల రోడ్డు, రింగు రోడ్డు మీదుగా సుండుపల్లెకు నడిపేవారన్నారు. కాగా కొద్దిరోజులుగా ఆర్టీసీ బస్సులను అధికారులు చిత్తూరు మార్గంలోని రింగు రోడ్డు మీదుగా, మాసాపేట మార్గంలోని రింగు రోడ్డుల మీదుగా నడుపుతుండడంతో ప్రయాణీకులు అయోమయానికి గురవుతున్నారన్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి సుండుపల్లె, రాజంపేట బస్సులను పాత మార్గంలోనే నడపాలని కోరారు.

వేర్వేరు ప్రమాదాల్లో పూరిల్లు, గడ్డివామి దగ్ధం


గడ్డివామిలో మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న ఫైర్ స్టేషన్ అధికారులు

రాయచోటి టౌన్ : వేర్వేరు చోట్ల నిప్పురవ్వలు పడి ఒక చోట గడ్డివామి మరో చోట పూరిల్లు, దగ్ధమయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణంలోని ధర్మారెడ్డి వీధికి చెందిన రాజమ్మ, సహదేవరెడ్డి దంపతులు. వీరూ పాడి గేదులు మేపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి సమీపంలోని గుర్తు తెలియని వ్యక్తులు టపాసులు పేల్చడంతో పశువుల కోసం ఉంచిన గడ్డివామిపై నిప్పురవ్వలు పడి మంటలు రేగాయి. అలాగే ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో అక్కడికి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే చాలా వరకు గడ్డివామి కాలిపోవడంతో రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

టి. సుండుపల్లె మండలం పెద్దినేని కాల్వ గ్రామంలోని మాన్యవారిపల్లెకు చెందిన జొన్నలగడ్డ నాగయ్యకు చెందిన ఒక పూరిల్లు (సుట్టిల్లు) టపాయాల పేల్చుతుండగా నిప్పురవ్వలు పడి దగ్ధమైంది. అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ సంఘటనకు పూరిల్లు మొత్తం కాలిపోయింది. ఇంటిలో దాచుకున్న రూ.20 వేలు నగదు కాలిపోయినట్టు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రమాదం సమయంలో ఎవరు ఇంటిలో లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. పూరిల్లు దగ్ధంతో తనకు రూ.50 వేలు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థులు


పెనగలూరు: జ్యోష్నను అభినందిస్తున్న ప్రిన్సిపాల్


సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి రోహిత్

పెనగలూరు : జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సహజ బ్లెస్సీ సోమవారం తెలిపారు. ఇటీవల విజయవాడ సిద్దార్థ జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయిలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీలలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ ఎంపీసీ చదువుతున్న టి.జ్యోష్న ఉత్తమ ప్రతిభ కనబరించిదన్నారు. పీఈటీ సుబ్రమణ్యంను, విద్యార్థి జ్యోష్నను పాఠశాల సిబ్బంది అభినందించారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు రోహిత్

పుల్లంపేట : జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన రోహిత్ అనే విద్యార్థి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ నీలకంఠరావు తెలియజేశారు. ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరులో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు పీడీ తెలియజేశారు.

మద్యం సేవించి వాహనం నడపడం నేరం


డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న ఎస్ఐ అబ్దుల్ జహీర్

నందలూరు (రాజంపేట) : మద్యం సేవించి వాహనం నడపడం నేరమని ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కడప – చెన్నై రహదారిలోని వ్యవసాయ తనిఖీ కేంద్రం వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమని, ఓవర్‌లోడ్ ఉండకూడదని, సరైన ధృవపత్రాలు కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ తప్పక ధరించాలని వాహనదారులకు సూచించారు. రహదారి నియమాలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్, పోలీసులు దిలీప్, రవి, చంద్రయ్య, దర్బార్, మహేంద్ర పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుటుంబం


గాయాలపాలైన జయలక్ష్మి, కుమారుడు నిశాంత్

ఒంటిమిట్ట : మండల కేంద్రంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక కుటుంబానికి చెందిన భార్య, భర్త, ఒక కుమారుడు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం కడప నుంచి తిరుపతికి దైవ దర్శనార్థం వెళుతున్న కుమారస్వామి కుటుంబం ఒంటిమిట్టలోని పెట్రోల్ బంకు వద్ద ఉన్న కడప–చెన్నై జాతీయ రహదారిపైకి రాగానే గుర్తుతెలియని మరో బైకు ఢీ కొట్టడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో కడప నుంచి తిరుపతి వైపు బైక్‌లో వెళుతున్న కుటుంబంలోని భర్త కుమారస్వామి (35), భార్య జయలక్ష్మి(30), కుమారుడు నిశాంత్(1) అనే ముగ్గురికి రక్త గాయాలు కావడంతో గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్ బాధితుడికి అండగా..


ఆర్థికసాయం అందిస్తున్న రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన బాధితుడు సయ్యద్ ఖాశింకు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కా రూపానందరెడ్డి రూ. 1 లక్ష చెక్కును ఆదివారం అందజేశారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని సయ్యద్ ఖాశింకు చెందిన ఇల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ఈ ప్రమాదంలో గృహోపకరణాలు, నగదు, పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ. 4 లక్షలు ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా బాధితునికి రూ. 1 లక్షలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్ సుబ్బారెడ్డి, మైనార్టీ నాయకులు మస్తాన్ వలి, అక్బర్ పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరిని విజయవంతం చేద్దాం


గోడపత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు

చిట్వేలి : విజయవాడలో ఈనెల 15వ తేదీన జరిగే ప్రజా రక్షణ భేరి ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పందికాళ్ల మణి, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్యలు పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మయ్యగారిపల్లెలో వారు బహిరంగ సభ గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజా సమస్యలు తెలుసుకుంటూ అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం పార్టీ ప్రజారక్షణ భేరి బస్సు యాత్రను చేపట్టిందని వివరించారు. ఈ సభకు పార్టీ అతిరథ మహారథులు హాజరుకానున్నారన్నారు. సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు కృష్ణయ్య, చిన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న బీజేపీ

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి జకరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా ఇంతవరకు పూర్తి చేయలేదన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హరిప్రసాద్, కదిరి ప్రసాద్, రత్నం తదితరులు పాల్గొన్నారు.